

## ఈగ మల్లేశంకు అభినందన వెల్లువ

బీఆర్ఎస్ వరంగల్ తూర్పు, పశ్చిమ రెండు నియోజక వర్గాలకు ఇంచార్జిగా నియమితులైన అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశంకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, డాక్టర్ ఎ.నాగేశ్వర్ రావు, తోపుడు బండి ఫౌండేషన్ చైర్మన్ ఎస్కే సాధిక్ అలీ, పరుశురాం యాదవ్, జూకంటి లక్ష్మణ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. -వరంగల్ వాయిస్, వరంగల్


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 116 | గురువారం | 02 నవంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




# పదునెక్కుతున్న ప్రచారం



వివరాలు 2లో..

### అస్త్ర, శస్త్రాలతో సిద్ధం
### గెలుపే లక్ష్యంగా వ్యూహాలు

### ఖర్చుకు వెనకాడని నేతలు
### వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి

### ప్రలోభాలతో ఆకట్టుకునేందుకు యత్నం

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. తమ అస్త్ర, శస్త్రాలతో ప్రచారాన్ని పదునెక్కిస్తున్నాయి. రోజువారీ దావత్‌లు నిత్యకృత్యంగా మారాయి. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో అన్ని రకాల ప్రలోభాలకు రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. గతేడాది జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో వలస ఓటర్లను ఆకర్షించిన ప్రధాన పార్టీలు..తమ గెలుపునకు అదే వ్యూహాలను అమలు చేస్తున్నాయి. ఓటర్లను మభ్య పెట్టేందుకు ఖర్చుకు వెనకాడడం లేదు. ఇప్పటి వరకు చేరికలపైనే దృష్టి పెట్టిన అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచారు. కనబడిన వారిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. వారి బాగోగులు అడిగి తెలుసుకుంటున్నారు. సెంటిమెంట్ డైలాగులతో ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామంటూ హామీలు గుప్పిస్తున్నారు. ఈ నెల రోజులు నా కోసం కష్టపడండి.. ఐదు సంవత్సరాలు మీకు సేవ చేస్తానంటూ ప్రచారాన్ని సాగిస్తున్నారు. -వరంగల్ వాయిస్ ప్రతినిధి

## నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు

### పోలీసుల అదుపులో నలుగురు ముఠా సభ్యులు

### తప్పించుకున్న మరో ముగ్గురు

### రూ.85వేల అసలు, రూ.4లక్షల నకిలీ కరెన్సీ స్వాధీనం



8లో



8లో

## రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



## మహా వృక్షాన్ని కూల్చారు

వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు అడ్డు వస్తుందన్న నెపంతో వందల ఏండ్ల నాటి ఊడల మర్రిచెట్టును నరకడం చర్చనీయాంశంగా మారింది. బల్దియా కార్యాలయానికి వచ్చే వందలాది మందికి నీడ నివ్వడంతోపాటు వేసవి కాలంలో తమ వాహనాలను ఇక్కడే పార్కింగ్ చేసేవారు. హరిత హారం పేరుతో లక్షల మొక్కలు నాటుతున్న బల్దియా అధికారులు ఇష్టారాజ్యంగా భారీ వృక్షాన్ని కూల్చడమేంటని ప్రశ్నిస్తున్నారు.
-వరంగల్ వాయిస్, వరంగల్

# పదునెక్కుతున్న.. ప్రచారం



## అస్త్ర, శస్త్రాలతో సిద్ధం
## గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
## ఖర్చుకు వెనకాడని నేతలు
## వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి
## ప్రలోభాలతో ఆకట్టుకునేందుకు యత్నం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ప్రచారాలకు పదును పెడుతున్నారు. పరస్పర విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తిస్తున్నారు. పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాలుస్తోంది. త్వరలో జరిగే ఎన్నికల్లో తమదే విజయమంటూ ఘంటాపథంగా చెప్పుకుంటున్నారు. ఖర్చుకు వెనకాడకుండా ప్రలోభాలతో ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే జంప్ జిలానీలతో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇవ్వాళ ఉన్న నాయకుడు రేపు వేరే పార్టీలో కనిపించడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టుకున్నట్లు రాజకీయ నేతలు వ్యవహరిస్తుండగా ఓటర్లు కూడా అదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఉదయం ఒక పార్టీ జెండాతో కనిపించిన వారు సాయంత్రం కాగానే మరో పార్టీ జెండాతో దర్శనమిస్తున్నారు.




### ప్రచార జోరు..

రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. అయితే పదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్...ఈ సారి ఎలాగైనా కేసీఆర్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా పని చేస్తోంది. అటు బీజేపీ సైతం అధికారంలోకి రావాలన్న కృతనిశ్చయంతో పని చేస్తోంది. మరోమారు అధికారం కోసం బీఆర్ఎస్ ప్రచార ఉధృతిని పెంచింది. సీఎం కేసీఆర్ ప్రచార సరళిని మార్చి జోరు పెంచారు. కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలకు పదను పెడుతున్నారు. యాభై ఏళ్లు ఏకచత్రాదిపత్యంగా రాష్ట్రాన్ని ఏలిన పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే మళ్లీ అభివృద్ధి వెనకబడుతుందన్న భయం కలిగిస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావులు తోడుగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని కాంగ్రెస్ దూకుడు పెంచింది. పార్టీ అగ్రనేతలు రాహుల, ప్రియాంక, మల్లి కార్జున ఖర్గేలు ఇప్పటికే రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. దీనికితోడు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ప్రధానంగా బీజేపీ నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి.

### కులాల వారీగా ఓటర్ల జాబితా..

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ నియోజకవర్గాల్లో కులాలవారీగా ఓటర్ల జాబితాను సిద్దం చేసే పనిలో పడ్డాయి. అందులో భాగంగా గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్నారు. గతేడాది జరిగిన మునుగోడు ఉప ఎన్నికల్లో వలస ఓటర్లను ఆకర్షించిన ప్రధాన పార్టీలు...తమ గెలుపునకు అదే వ్యూహాలను ఇప్పుడు అమలు చేస్తున్నారు. అవసరం అయిన చోట్ల గంపగుత్తగా..లేదంటే ఓటర్ల వారీగా డబ్బు ముట్టజెప్పేందుకు అభ్యర్థులు రకరకాల వ్యూహాలు రచిస్తున్నారు. ప్రస్తుతం జాబితా తయారీలో నిమగ్నమైన బృందాలు... త్వరలోనే పూర్తి నివేదికను అభ్యర్థులకు అందజేయనున్నాయి. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఓటర్ల చిరునామాల సేకరణకు ఓ ప్రధాన పార్టీ ప్రత్యేక బృందాలనే నియమించుకున్నారు. ప్రతి గ్రామంలో ఇద్దరి నుంచి ముగ్గురు సభ్యులు బృందంగా ఏర్పడి... గ్రామాల వారీగా ప్రతి వలస ఓటరు చిరునామా, ఫోన్ నంబరుతో ఓ డేటాబేస్‌ను తయారు చేస్తున్నారు. ప్రత్యేక బృందానికి రెండు నెలల పాటు నెలవారీ వేతనం ఇస్తున్నారు. ఇందులో కులాల, మతాల ఆధారంగానూ లెక్కలు తీస్తున్నారు.

### వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి..

గెలుపు కోసం ప్రధాన పార్టీలు పక్కా వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. గెలుపోటముల్లో కీలక పాత్ర వహించే వలస ఓటర్ల సమాచార సేకరణపై పార్టీలు దృష్టి సారించాయి. తెలంగాణ వ్యాప్తంగా లక్షల మంది ఓటర్లు వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. వీరంతా ఎన్నికల సమయంలో వచ్చి ఓటేయడం ఆనవాయితీగా వస్తోంది. కొందరిని బలవంతంగా రప్పించి ఓటేయించుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను రప్పించడానికి వారి సామాజికవర్గానికి చెందిన సంఘాలతో ప్రధాన పార్టీల నాయకులు మంతనాలు చేస్తున్నారు. నోటిఫికేషన్ విడుదలైతే ప్రచారంలో తీరికలేకుండా ఉంటామని భావిస్తున్న నేతలు...ఇప్పటి నుంచే వారితో మంతనాలు సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారికి ఇప్పటినుంచే మెసేజ్‌లు పెడుతున్నారు. నివేదిక ప్రకారం సామాజికవర్గాల వారీగా ఎంత మంది ఓటర్లున్నారో తెలుసుకొని వారందరూ తమకు మద్దతిచ్చేలా ఆయా వర్గాల నాయకులతో చర్చలు జరిపేందుకు ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. వలస ఓటర్లు ఎక్కువగా ఉన్న ఓ మండలంలోని ఆయా గ్రామాల్లోని ఓటర్ల చిరునామాల సేకరణ ఓ బృందాన్ని నియమించుకున్నారు. వారికి భారీ ప్యాకేజ్‌ని సైతం ఇచ్చినట్లు తెలుస్తోంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ ఓటర్లను స్వస్థలాలకు ఎన్నికల సమయంలో తీసుకుని రావడానికి ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నారు. ప్రధాన పార్టీ నుంచి టిక్కెట్ దక్కించుకున్న నాయకులు సైతం వలస ఓటర్ల జాబితాను తయారు చేసే పనిని ఎన్నికల బృందానికి అప్పగించారు. అత్యధికంగా ఒక్కో నియోజకవర్గంలో 5 నుంచి 40 వేలకుపైగా వలస ఓటర్లు ఉంటారని ప్రధాన పార్టీలు లెక్కతేల్చాయి. వలస వెళ్లిన వారు అనుకున్న సమయానికి పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా ప్రణాళిక రచిస్తున్నారు.

### గెలుపోటములపై ప్రభావం..

వలస ఓటర్లతో ఇప్పటి నుంచే టచ్‌లో ఉంటూ ఎన్నికలకు రెండు, మూడు రోజుల ముందుగానే స్వస్థలాలకు తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు, గతంలో పార్టీ సానుభూతిపరులుగా ఉన్న వారిని ప్రచారానికి సైతం రావాలని ఆహ్వానిస్తున్నారు. వారికి ఇస్తామన్న మొత్తాన్ని అక్కడికక్కడే ఇచ్చేందుకు పార్టీలు వెనుకాడటం లేదు. ఇలా మొత్తంగా వలస ఓటర్ల లెక్కలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు సేకరించే పనిలో ప్రధాన పార్టీల విభాగాలు చురుకుగా పనిచేస్తున్నాయి. వీరిని ఎవరు రప్పిస్తే వారు గెలిచినట్లుగా భావిస్తున్నారు. వీరిని ఎవరు రప్పించుకుంటే వారికి గంపగుత్తగా ఓటేస్తారని అనుకుంటున్నారు. ఈ నెల 30 ఒకే దఫాలో పోలింగ్ జరుగనుంది. అయితే ఖర్చుకు వెనకాడకుండా ముందు వరుసలో బీఆర్ఎస్ ఉంది. బీఆర్ఎస్‌లో ఓ విభాగం చురుకుగా దీనిని చేపట్టింది. మొత్తంగా గ్రామాలకు ఓటర్లను రప్పిస్తే గెలుపోటములపై ప్రభావం తప్పకుండా ఉంటుందన్న భావన ఉంది.

### తాయిలాలతో గాలం..

స్థానికంగా ఉంటున్న ఓటర్లకు తాయిలాలతో గాలం వేసేందుకు అన్ని పార్టీలు సిద్ధపడుతున్నాయి. గిఫ్టుల రూపంలో అందించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే వివిధ రకాల గిఫ్టులను నియోజవర్గాల వారీగా సిద్ధ: చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల ఎన్నికల అధికారులు నిర్వహించిన దాడుల్లోనూ వందల కొద్ది గిఫ్ట్‌లు పట్టుబడిన విషయం విధితమే. అదే విధంగా ప్రతి రోజు ప్రచారానికి వచ్చే వారికి భోజన సదుపాయాలతోపాటు నగదు రూపంలోనూ ముట్టచెబుతున్నారు. కొందరు బీరు, బిర్యాని అన్న నానుడిని నిజం చేస్తున్నారు. మొత్తగా ఈ ఎన్నికలు గతంకంటే భిన్నంగా జరుగనున్నట్లు అంచనా వేస్తున్నారు.

## పరకాల బరిలో డాక్టర్ కాళి ప్రసాద్

### బీజేపీ మూడో జాబితాలో టికెట్ కన్ఫామ్
### సంబరాలు జరుపుకున్న పార్టీ శ్రేణులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు పేరును ఆ పార్టీ అధిష్టానం కన్ఫామ్ చేసింది. 35మందితో బీజేపీ మూడో జాబితాను గురువారం విడుదల చేశారు. కాళీ ప్రసాద్ కు పరకాల టికెటక్ కేటాయించడంతో పార్టీ కార్యాలయంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీసీ ముఖ్యమంత్రి ప్రకటన కలిసొస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలందరూ బీజేపీకి అండగా నిలుస్తున్నారన్నారు. కాషాయ పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా పరకాల నియోజకవర్గంలో సైతం బీసీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కాళీ ప్రసాద్ పేరు ప్రకటించడంతో పరకాల బహుజనులందరూ ఎమ్మెల్యేగా కాళి ప్రసాద్ ను గెలిపించేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి నరేష్, మోర్చాల అధ్యక్షులు గోనెల నరసింహ, ఆకుల రాంబాబు, పాలకుర్తి ప్రతాపు, నాయకులు ధర్నా నారాయణదాసు, దుబాసి వెంకటస్వామి, బూత్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వర్లు, పిట్ట కిషోర్, ముత్యాల దేవేందర్, బలభద్ర రాజు, ఒంటేరు వీరేష్, పుల్లట్ల కృపేందర్ రెడ్డి, చెరిపల్లి సునీల్, చెక్క నాగరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి అండగా ఉంటా

### ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
### మద్దతుగా పద్మశాలీల ఏకగ్రీవ తీర్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నన్నపునేని నరేందర్ గురువారం ఉదయం వరంగల్ కూరగాయల, పండ్ల మార్కెట్ లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ లో కలియ తిరుగుతూ ఆశీర్వదించండి అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వ్యాపారిని ఆప్యాయతగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మునుపెన్నడు చూడని విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ వ్యాపార, వాణిజ్యాలకు అనుకూలంగా తీర్చి దిద్దామన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు జరుగుతున్నాయని ఆ ప్రగతి అందరి కళ్ళముందే కనబడుతోందన్నారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే అన్ని వర్గాల ప్రజలు ఆర్థికాభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ నియోజకవర్గంలో రూ.4,100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నూతన కలెక్టరేట్, నూతన బస్టాండ్, ఇన్నర్ రింగ్ రోడ్, రూ.1,250 కోట్లతో 24 అంతస్థుల హాస్పిటల్ అందుబాటులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అతి త్వరలో ఈ మార్కెట్ పనులు పూర్తవుతాయన్నారు. వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఈ మార్కెట్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ పెద్దలు, వ్యాపారస్తులు ఎమ్మెల్యేకు మద్దుతు తెలిపారు.

### ఎమ్మెల్యే నరేందర్ కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని పద్మశాలీలు గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్ కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేసి తమ ఆమోద పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఖిలా వరంగల్ పడమరకోటలో 2005లో స్థాపించిన శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం అధ్యక్షులు వారి కార్యవర్గం, మహిళలు పద్మశాలి పెద్దలు ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

## పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న



**వరంగల్ వాయిస్, రేగొండ :** బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ రేగొండ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో చిన్నకొడేపాక గ్రామంలో బీజేపీ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపెల్లి పాపన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపన్న మాట్లాడుతూ అవినీతి బీఆర్ఎస్ ను, కుటుంబ పాలనను ఇంటికి పంపించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద ప్రజల కోసం కృషి చేస్తుందన్నారు. జరగబోయే ఎన్నికలలో భూపాలపల్లిలో చందుపట్ల కీర్తి రెడ్డి గెలుపు తథ్యమని తెలిపారు. కరోనా విపత్కర సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉచిత టీకాలు పంపిణీ చేశారని అన్నారు. దేశవ్యాప్తంగా యువత ముఖ్యంగా భూపాలపల్లి నియోజకవర్గంలో యువత ఓట్లు అత్యధికంగా ఉన్నాయని ఈసారి యువత కీర్తి రెడ్డి మద్దతుగా నిలబడుతున్నారని పేర్కొన్నారు. బీసీ సీఎం ప్రకటనతో బీసీ సామాజిక వర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా కిసాన్ మోర్చా పోలుసాని తిరుపతి రావు, జిల్లా కార్యదర్శి సుంకరి మనోహర్, మండల రాష్ట్ర కళాశాల కన్వీనర్ సయ్యద్ గాలిఫ్, ప్రధాన కార్యదర్శి పెండెల రాజు, బూత్ అధ్యక్షుడు మాటేటి రమేష్, మార్క ముత్యా, రాములు తాళ్లపల్లి మధుసూదన్, శక్తి కేంద్రం ఇంచార్జి దూరి సత్యనారాయణ, చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్, బండారి శీను, బాసాని ప్రశాంత్, ఇల్లందుల మొగిలి, తొట్ల రవీందర్, వంగ రాము, బొంతల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నెరవేర్చిన పెద్ది

## చెన్నారావుపేట వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పాత ముగ్ధుపురం ప్రజలకు ఇచ్చిన మాటకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి కట్టుబడి ఉన్నాడని చెన్నారావుపేట వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి అన్నారు. పాత ముగ్ధుపురం గ్రామం గతంలో నర్సంపేట మండలంలో ఉండేది. ఈ విషయమై పలుమార్లు బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డిని కలవగా వారిని పార్టీలకు అతీతంగా గ్రామ సర్పంచ్ నీ ఏకగ్రీవంగా ఎన్నుకొని రమ్మని చెప్పడం జరిగింది. అదేవిధంగా పార్టీలకు అతీతంగా సర్పంచ్ ను ఎన్నుకోవడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం పెద్ది సుదర్శన్ రెడ్డి పాత ముగ్ధుపురం గ్రామాన్ని చెన్నారావుపేటలో కలపడం జరిగిందని కంది కృష్ణారెడ్డి అన్నారు. వారు గురువారం ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటిటి ప్రచారం చేశారు. అలాగే మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్, గ్రామ ఉపసర్పంచ్ మేకల సది, నాయకులు సుంకరి సాంబయ్య, పోలేపల్లి రమేష్ పోలేపల్లి ఏకాంబరం, నాంపల్లి మల్లయ్య, ననుమాస రాములు, సుంకరి సురేష్, జన్ను సూరయ్య, చెరుపల్లి రాజు, షేక్ వలి, పటాన్ వలి,పాల్గొన్నారు.

# నేషనల్ గేమ్స్ హ్యాండ్ బాల్ రెఫరీగా విష్ణువర్ధన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ గేమ్స్ రెఫరీగా హనుమకొండ స్పోర్ట్స్ అథారిటీ హ్యాండ్ బాల్ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్ ను నియమించామని సాట్ డైరెక్టర్ కే.లక్ష్మి తెలిపారు. గోవాలో ఈనెల 4 నుంచి 9 వరకు జరిగే నేషనల్ గేమ్స్ లో హ్యాండ్ బాల్ రిఫరీగా విష్ణువర్ధన్ వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేషనల్ గేమ్స్ కాంపిటీషన్ డైరెక్టర్ ఎం.కార్తికేయన్ తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, సాట్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ కుమార్, హనుమకొండ డీవైఎస్ఓ గగులోతు అశోక్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్ ఖాన్, కైలాస్ యాదవ్, కోచ్ లు, డీఎస్ఏ సిబ్బంది, తదితరులు అభినందనలు తెలిపారు.

# పరకాల గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా

## కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన 10కుటుంబాలు నడికూడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి, మహారాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నేత ప్రకాష్ రాథోడ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని, రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. దొంగ హామీలతో, మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి సీఎం కేసీఆర్ గద్దెనెక్కారనీ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి పాలన నచ్చక కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీలకు, డిక్లరేషన్లకు ఆకర్షితులై, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని తెలుసుకొని గురువారం బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. అదేవిధంగా తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను, మహాలక్ష్మి స్కీం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత, రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లలో ప్రవేశపెట్టిన పథకాలను క్లుప్తంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారనీ అన్నారు. ప్రతి పేదవాడి గుండెల్లో హస్తం గుర్తు నిలిచిపోయిందని, దానిని తుడిచి పెట్టడం ఎవరికి సాధ్యం కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేరుస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారు కోడెపాక రాజయ్య, కోడెపాక సమ్మయ్య, కోడెపాక రామస్వామి, కోడెపాక స్వామి, కోడెపాక ప్రమోద్, కోడెపాక భరత్, కోడెపాక విక్రమ్, తగురాపు సన్నీ, కేతపాక రాకేష్, మామిడిపల్లి శివ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి దొమ్మటి సాంబయ్య, నడికూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, నడికూడ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమార్, కోడెపాక సదయ్య, మండల మీడియా కోఆర్డినేటర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 19వ డివిజన్ గాంధీనగర్ నుంచి సుమారు రెండు వందల మంది బీఆర్ఎస్ నుంచి గురువారం రాంనగర్ లోని కొండా దంపతుల నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, మాజీ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు, సురేఖ దంపతులు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో పొన్నాల సంపత్, ఒంటెల కిరణ్, మేకల సురేష్, మంద సంపత్, చింతరాజు, చింత పోసెట్టి, చింత వినయ్, చింత విక్రం, కొట్టే లక్ష్మి, పొన్నాల శారద ఆధ్వర్యంలో 200మంది బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి రాజేష్, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గిరిగిరి పుష్ప, మాజీ కౌన్సిలర్ అంబి సాంబరాజు, కాంగ్రెస్ నాయకులు జన్ను అరవింద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ చేసిన ఆర్,ఐ కాలువల శ్రీనివాస్ దేశాయిపేటకు చెందిన రెవెన్యూ ఉద్యోగి కాలువల శ్రీనివాస్ ప్రస్తుతం జనగామ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సొంత ప్రాంతానికి కూడా సేవ చేసే ఆలోచనలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ చైర్స్ పంపిణీ చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలియజేశారు. శ్రద్ధగా చదువుకుని మంచి పౌరులుగా సమాజంలో రాణించాలని చెడు ప్రభావాలను గురి కాకుండా గొప్ప లక్ష్యాలు ఏర్పరుచుకొని వాటిని సాధించుకునేందుకు దుర్వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులకు, పాఠశాలకు సొంత ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తద్వారా సమాజంలో మంచి మార్పులు తీసుకు రావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి వారి సౌకర్యం కోసం స్టడీ చైర్స్ పంపిణీ చేసినందుకు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకుడు డా.పాలడుగుల సురేందర్ ,వ్యాయామ ఉపాధ్యాయుడు నిశాంత్ వేణు, జాకీర్, పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలోని కాంగ్రెస్ , బీజేపీ పార్టీ నుంచి నాయకులు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో వారి నివాసంలో బీఆర్ ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పరకాలలో గత 60ఏండ్లుగా జరగని అభివృద్ధి గత 10ఏండ్ల కాలంలో జరిగిందని, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేసామని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో చిర్ర సారంగపాణి (సీనియర్ కాంగ్రెస్ లీడర్ ), పిల్లల అనిల్ (ఓబీసీ బీజేపీ మండల నాయకులు), సీహెచ్.రాజేందర్ (బీజేవైయం గ్రామ పార్టీ అధ్యక్షుడు), యువకులు అజయ్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్, అనిల్, జోగేశ్వర్, హరీష్, సునీల్, సాయి, శ్రీనివాస్, రమేష్, దహీం పాషా చేరారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎంపీటీసీ..

గీసుగొండ మండలంలోని శాయంపేట గ్రామ ఎంపీటీసీ కాయిత భిక్షపతి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో వారి నివాసంలో బీఆర్ ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గడపకు చేరాయని, ప్రజలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ గత 60ఏండ్ల పాలనలో చేసింది ఏమి లేదని, ఆ పార్టీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో అసహనం

## బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 21వ డివిజన్ కు చెందిన సుమారు 50మంది బీఆర్ఎస్ కార్యకర్తలు వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు నాయకత్వంలో బీజేపీలో చేరారు. ఓ సిటీలోని వారి క్యాంపు కార్యాలయంలో వీరికి కాషాయ కండువా కప్పి ప్రదీప్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గా ప్రజలు బీజేపీ పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పరిపాలన దక్షత పట్ల, సంక్షేమ పథకాలకు ఆకర్షకులై పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారన్నారు. యువత ఇంత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పులో కాషాయ జెండా ఎగురవేయటం ఖాయమన్నారు. నగర ప్రజలు బీఆర్ఎస్ పార్టీ పాలనపై అసహనంతో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా ఉంటుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువతను కోరారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అకెన వెంకటేశ్వర్లు, గాదె భిక్షపతి, గొరంటల రాజేష్, ఆకెన కిరణ్, చేరాల వెంకటేశ్వర్లు, లింగబత్తిని రాము, దాసి రాజు, గాదె రాజు, గాజర్ల మధు, బండారి నరేష్, దేవులపెల్లి రాఖేష్, సర్వ సుధాకర్ తదితరులు



ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, కోమాకుల నాగరాజు, దోమల భవాని శంకర్, బైరి మురళీకృష్ణ పాల్గొన్నారు.

# మళ్లీ ఆశీర్వదిస్తే.. మరింత అభివృద్ధి

## ఎన్నికల ప్రచారంలో చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో గురువారం పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళల మంగళ హారతులు, కోలాటాలు, డబ్బు చప్పులతో ప్రచారాన్ని ప్రారంభించారు. వెంకటేశ్వర్ల పల్లి, నార్లాపూర్, చర్లపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరొకసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను విశ్వసించవద్దని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి తన ఊరికి ఏమి చేయలేని రేవూరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. మూడుసార్లు ఓడిన అభ్యర్థిని ఎవరు విశ్వసించరని, పరకాలలో బీజేపీ ఖాళీ అయిందని ధర్మారెడ్డి తెలిపారు. పదేళ్లకు పూర్వం నియోజకవర్గ అభివృద్ధి, తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. రానున్న ఎన్నికల్లో మరొకసారి గెలిపిస్తే ఈసారి మహిళల, యువత ఉపాధి కోసం కృషి చేస్తానని, అలాగే పేద ప్రజలకు గృహ నిర్మాణంపై దృష్టి పెడతానని తెలిపారు. ఈఎన్నికల ప్రచారంలో ధర్మారెడ్డి వెంట ఎంపీపీ మచ్చ అనసూయ రవీందర్, జడ్పీటీసీ కోడపాక సమలత కరుణాకర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన ఆర్ఐ నరేష్ కుమార్



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ గా విధులు నిర్వహిస్తున్న జూపాక నరేష్ కుమార్ గురువారం విధుల్లో చేరి తన బాధ్యతలు చేపట్టారు. ఆర్ఐ నరేష్ కుమార్ ఇటీవల ఆగస్టు 1న, రేగొండ తాసిల్దార్ కార్యాలయంలో తన పనులు ముగించుకొని సాయంత్రం ఐదు గంటలకు తోటి సిబ్బంది రాజయ్య ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వెళుతున్న సంఘటనలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నరేష్తో పాటు రాజయ్య ప్రమాద బారిన పడగా, నరేష్ తీవ్రంగా గాయపడగా రాజయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో ఆర్ఐ నరేష్ హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకొన్నారు. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఆస్పత్రిలో చికిత్స పొంది, నవంబర్ 2న పదవి బాధ్యతలు చేపట్టారు. నరేష్ గత రెండు సంవత్సరాల కిందట విధుల్లో చేరి, కార్యాలయంలోని తన విధుల్లో భాగంగా చక చక విధులు నిర్వహించడంతో ప్రజల్లో మెప్పు పొందారు. తిరిగి ఆర్ఐ రేగొండ తాసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నరేష్ పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆగిపోయిన పనులు సకాలంలో తమకు అందుతాయని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు నరేష్ గురువారం ఉదయమే విధుల్లో చేరేందుకు స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ స్వామిని కలిసి పదవీ బాధ్యతలు చేపట్టారు.

## ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణం

### డీఎంహెచ్ఓ సాంబశివ రావు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశానుసారం హనుమకొండ పట్టణ పరిధిలో డాక్టర్లు, సిబ్బంది ద్వారా స్వీప్ ఓటర్ల అవగాహన, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.బి.సాంబశివ రావు తెలిపారు. వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎన్ జీఓఎస్ కాలనీ నుంచి ప్రోగ్రాం అధికారులు, డాక్టర్లు, సిబ్బందితో కలసి గురువారం అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు కలిగి ఉండటం, అలాగే ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ నవంబర్ 30న జరిగే శాసన సభ ఎన్నికలలో విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటు ప్రజాస్వామ్యానికి ప్రాణం పోస్తుందన్నారు. అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాలీలు, అలాగే హెల్త్ క్యాంపులు, రక్త దాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని హాజరైన వారికి ఓటు ప్రాధ్యాన్యత గురించి అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఐఎంఏ, స్వచ్ఛంద సంస్థలను జిల్లా స్థాయి ర్యాలీలలో భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీ ఎన్ జీఓఎస్ కాలనీ, బాలయ్య హొటల్ మీదుగా వడ్డేపల్లి వరకు నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఉమా శ్రీ, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాలిక, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, ఆర్ బీఎస్ కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గ ప్రసాద్, డిప్యూటీ డెమో ప్రసాద్, సీహెచ్ఓ మాధవ రెడ్డి, వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం సీఓ మానస, డీపీఓ ఎన్ హెచ్ఎం శ్రీనివాస్, సూపర్ వైజర్ గోవర్ధన్ రెడ్డి, కమలాకర్, పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నరకాసుర వధ ఉత్సవాలకు బందోబస్తు కల్పించండి

## పోలీసులకు వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల కోడ్ ను అనుసరించి నరకాసుర వధ ఉత్సవాలు జరుపుకోవాలని మిల్స్ కాలనీ ఎస్ హెచ్ఓ టి. సురేష్ అన్నారు. గురువారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్ హెచ్ఓ సురేష్ కు బొకే ఇచ్చి వినతిపత్రం అందజేశారు. ప్రాచీన సాంప్రదాయంలను, సంస్కృతిని, ఆచారాలను నేటి తరానికి తెలియచేయడానికి గత 19సంవత్సరాల నుంచి ఉత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 70అడుగుల ఎత్తులో భారీ నరకాసుర విగ్రహానికి బాణా సంచాలు అమర్చి దహనం చేస్తామని, ఈ ఉత్సవాలకు దాదాపు 15వేల మంది భక్తులు ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుచున్నందున ఉర్సు గుట్ట వద్ద 11న జరిగే నరకాసుర వధ ఉత్సవాల్లో శాంతి భద్రతకు భంగం కలగకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు నిర్వహించాలని కోరారు. నరకాసుర వధ ఉత్సవం రోజున శాంతిభద్రతల దృష్ట్యా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయిస్తానని మిల్స్ కాలనీ ఎస్ హెచ్ఓ టి.సురేష్ తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కమిటీ సభ్యులు కనుకుంట్ల రవి, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, వంగరి సురేష్, నాగవెల్లి రంజిత్, కుడికాల సాంబశివరావు, దూడ కొమురెల్లి, పోలేపాక మల్లేశం, తౌటం నరసింహ, కొమ్ము రాజు, మంద పవన్ లు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపును అడ్డుకోలేరు



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుగొండ మండలం ఎలుకుర్తి (హవేలి)గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువత గురువారం గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ భీమాగాని సౌజన్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరగా వారికి పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా పరకాల నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ గెలుపును అడ్డుకోలేరని, ప్రజలను మభ్యపెట్టి ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి నేడు ప్రజలను ఓట్లు అడగడానికి వచ్చిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకొనే అవకాశం వచ్చిందని, ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా ప్రచారాన్ని ఉధృతం చేసి గీసుగొండలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రాంపాక ప్రశాంత్,అక్కేల్లి పవన్ కళ్యాణ్, అక్కేల్లి నాగరాజు, అక్కేల్లి రంజిత్, మంద చందు,అక్కేల్లి జగన్, అక్కేల్లి రాజు, కొంగర సంపత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్ల సురేష్ బాబు,గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ గారం పల్లి రమేష్, కోశాధికారి గోవు శౌరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన ముదిరాజులు



**వరంగల్ వాయిస్, పరకాల :** రాజుపేట, పోచారం గ్రామాల నుంచి యువత పరకాల బీజేపీ పట్టణ కార్యాలయంలో రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్ ఆధ్వర్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి సమక్షంలో ముదిరాజు యువతకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ముఖ్యమంత్రిని ప్రకటించిన బీజేపీని బలపరిచేందుకు తెలంగాణ సబ్బండ వర్గాలు గెలుపే లక్ష్యంగా కృషి చేస్తున్నారని అన్నారు. రాబోయే బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మార్త భిక్షపతి, దేవునూరి మేఘనాథ్, కొలనుపాక భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే పెద్ది

**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని సూర్యా పేట తండా గ్రామ పంచాయితీ చెందిన వాంకుడోత్ ఎంకట్రాం గురువారం అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించి ఆ కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సాయం చేశారు. అలాగే ఇటీవల మరణించిన దరావత్ మానియా కుటుంబానికి పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. జడ్పీటీసీ పత్తి నాయక్, సర్పంచ్ దారవత్ కిషన్, ఎంపీటీసీ డి.శ్రీను, ఉపసర్పంచ్ డి.శోభన్, ఖాదర్ పేట సర్పంచ్ కుమారస్వామి బీఆర్ఎస్ నాయకులు బాలు, రెడ్యా, భాస్కర్, శ్రీను, జవహర్, వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి గ్రామ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, నడికూడ :** రాయపర్తి గ్రామ పద్మశాలి కుల బంధువుల కాల పరిమితి ముగిసినందున గురువారం రాయపర్తి గ్రామంలో గాదె శంకరయ్య అధ్యక్షతన కుల బంధువుల ఆధ్వర్యంలో కుల పెద్దమనుషులను ఎన్నుకోవడం జరిగింది. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా గాదె శంకరయ్యను ఎన్నుకున్నారు. కుల పెద్ద మనుషులుగా కడారి సమ్మయ్య, వంగర రాజయ్య, గాదె వెంకటస్వామి, రాచర్ల సమ్మయ్య, మార్త రాజులను, ముఖ్య సలహాదారులుగా మోత్కూరి శంకరయ్య, గడ్డం సర్వేశం, దార్నా వెంకటస్వామి, బాల్నే ఆనందం, వావిలాల పురుషోత్తంలను కులబంధువుల ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది.

## తిమ్మరహేన్ పహాడ్ గ్రామం కాంగ్రెస్ అడ్డా



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని తిమ్మరహేన్ పహాడ్ గ్రామం నుంచి ఎమ్మెల్యే మెప్పు కోసం బీఆర్ఎస్ వాళ్లకే మళ్లీ కండువాలు కప్పించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు జయరాజ్ అన్నారు. బీఆర్ఎస్ లో మా గ్రామం నుంచి చేరింది ఇద్దరు మాత్రమేనని కానీ, చాలా మంది చేరినట్టుగా గొప్పలు చెప్పుకొని సంకలు గుద్దుకుంటున్నారని జయరాజ్ ఎద్దేవా చేశారు. అధికార బీఆర్ ఎస్ మా గ్రామానికి చేసిన అభివృద్ధి ఏమి లేదని, మా గ్రామంలో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ వారికి లేదన్నారు. ఎవరు ఎన్ని జిమ్మికులు చేసిన తిమ్మరహేన్ పహాడ్ గ్రామం కాంగ్రెస్ అడ్డా అని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో మా నాయకుడు దొంతి మాధవరెడ్డికి అధిక మెజార్టీ ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్వన్నేస్, నిజాం, దేవా దానయ్య, తమాసు, రాయన్న, జోజీ, బాబు, రషీద్, నవీన్, మంద నరేష్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి



**వరంగల్ వాయిస్, రేగొండ :** మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పట్టెం శంకర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.. రేగొండ మండల పార్టీ కార్యాలయంలో వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య సమక్షంలో వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మండలంలో రోజురోజుకు కాంగ్రెస్ కు ఆదరణ పెరుగుతుందని తెలియజేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. తెలంగాలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజల్లోకి చొచ్చుకుపోయాయని ఆయన తెలిపారు. వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ పాత తరం కార్యకర్తలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం పట్ల పార్టీకి పూర్వ వైభవం కనబడడంతో సత్తన్న గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గాజర్ల అశోక్, మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గండి తిరుపతి గౌడ్, కాంగ్రెస్ నాయకులు బండారి దేవేందర్, మండల ప్రధాన కార్యదర్శి పత్తి తిరుపతి, బీసీ మండలాధ్యక్షులు పొన్నగంటి బ్రహ్మం, శంకర్, యూత్ నాయకులు బోయిని వినోద్ కుమార్, జోరు సుదర్శన్, మైస సురేందర్, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల బరిలో జర్నలిస్ట్ అయిత ప్రవీణ్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** తెలంగాణ రాష్ట్ర శాసనసభకు జరగబోయే ఎన్నికల్లో వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పట్టణానికి చెందిన అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ అయిత ప్రవీణ్ కుమార్ బరిలో నిలవనున్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో అయిత ప్రవీణ్ కుమార్ ఎన్నికల అధికారుల నుంచి నామినేషన్ పత్రాలను పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశం ద్వారా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి ఆమోదం పొందిన పార్టీ అభ్యర్థిగానైనా లేదా స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని అన్నారు. ఈనెల 5, 7తేదీల్లో మూడు సెట్ల నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# కార్మికుల డిమాండ్లను మ్యానిఫెస్టోల్లో పెట్టాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రంలో 30 శాతానికి పైగా ఉన్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర కార్మిక డిమాండ్లను రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోల్లో పెట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పసుల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి డిమాండ్లతో పాటు జిల్లా పరిధిలోని అనేక అంశాల మీద చర్చించి వర్కర్స్ మేనిఫెస్టో రూపొందించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఒక్క పరిశ్రమ కూడా లేని జిల్లా మహబూబాబాద్ జిల్లాయని, జిల్లాలో ఉక్కు, బైరటిస్, సున్నం పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. హమాలి, ట్రాన్స్ ఫోర్ట్, స్ట్రీట్ వెండర్స్, మిర్చి తొడిమెలు తీసేటువంటి అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, ఐకేపీ వీవోఏ, మధ్యాహ్న భోజన కార్మికులకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న, సీఐటీయూ సీనియర్ నాయకులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జమ్ముల శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రాపోలు వీరన్న, సీఐటీయూ నాయకులు కసన బోయిన కుమారస్వామి, తిమ్మిడి రవి, గుంటుక కుమార్, పిట్టల రాములు, ఝాన్సీ, మంజుల, రేణుక, సరళ తదితరులు పాల్గొన్నారు.

# దొంతి మాధవరెడ్డి గెలుపు ఖాయం

### సర్పంచ్ తూటి పావని రమేష్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** రాష్ట్రంలో గిరిజన సమాజాన్ని మోసం చేసిన ఘన చరిత్ర కేసీఆర్ దేనని, తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ నాయకులు చెప్పే కల్ల బొల్లి మాటలు నమ్మకండని గ్రామ సర్పంచ్ తూటి పావని రమేష్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తూటి పావని రమేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులు ఊసంత కూడా లేవని విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు అయిన ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల ను గడప గడపకి వెళ్లి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ పథకాలను అమలుచేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ మాట ఇస్తే చేస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలు తప్పా చేసేదేమీ లేదన్నారు. ప్రచారం అనంతరం హరియా నాయక్ తండా నుంచి గ్రామం వరకు కాంగ్రెస్ నినాదాలు చేసుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ వీరన్న నాయక్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బోనగిరి స్వామి, లావుడ్యా వెంకన్న, ప్రధాన కార్యదర్శి చందర్, వార్డు సభ్యులు ఆకుల అశోక్, ఈర్ల అనూష శ్రీను, స్వామి, భూక్య రవి, నాయకులు బాదావత్ వీరు నాయక్, భూక్య సురేష్,పెద్దమ్మల రాజేందర్, ముత్యం భద్రయ్య, బాలు, తేజావత్ భద్రు, కట్టస్వామి, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కయాజ్, ఒంటరి రాజు, ఒంటరి బాబు, కరెడ్ల రవి, బూత్ అధ్యక్షులు భూక్య రాజు, తేజావత్ శివ, కరెడ్ల శివ, బాలు, ఒంటరి అశోక్, తేజావత్ స్వామి, పడిదం రాకేష్, కిషోర్, సంతోష్, రాజు, నవీన్, ఈర్యా, ముత్యం పెద్ద రాజు, రమేష్, ఇస్లావత్ వీరు, గొడిశాల రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గోకారపు శ్యాం కుమార్‌కు అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నవంబరు 1న ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం పురస్కరించుకొని విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి వారి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ పత్రికలలో పని చేస్తున్న ఫొటో జర్నలిస్టులకు ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. సుమారు 600మంది ఫొటో జర్నలిస్టులు పాల్గొనగా ఈ పోటీలు రెండు విభాగాలుగా నిర్వహించారు. ఒకటి ఫొటో జర్నలిజం, రెండవది పండుగలు. ఈ పోటీలలో మొదటి బహుమతి, రెండో బహుమతి, మూడో బహుమతి, ఆరు అప్రిసేషన్ అవార్డులుగా కమిటీ వారు ప్రకటించారు. ఫొటో జర్నలిజం విభాగంలో తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాకు చెందిన ది హన్స్ ఇండియా ఫొటో జర్నలిస్టు గోకారపు శ్యాం కుమార్‌కు అప్రిసియేషన్ అవార్డు గెలుచుకోవడం జరిగింది. ఈ అవార్డును గోకారపు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థాన న్యాయాధిపతి డాక్టర్ జస్టిస్ మన్మథ రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆర్టిస్టు రామారావు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ అవార్డు రావడంపై శ్యాం కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రచారంలో స్పీడ్ అందుకున్న కారు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** బీఆర్ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు కేతిరి వీరారెడ్డి, బాల్నే వెంకన్నలు కోరారు. గురువారం మండలంలోని జగ్గు తండా, గొల్లపల్లి తండా తదితర గ్రామాలలో నర్సంపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తి నాయక్, మండల యూత్ కన్వీనర్ కంది కృష్ణ చైతన్య రెడ్డి, సర్పంచులు సమ్మ నాయక్, భిక్షపతి, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, ఖాదర్ పేట ఎంపీటీసీ శ్రీనివాస్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# తండ్రి విజయం కోసం తనయుడి ఆరాటం

## ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా ఇంద్రనీల్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ప్రజాసేవను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న కుటుంబం అది. మాజీ ఎంపీ, సీఎం కేసీఆర్ కు అత్యంత సన్నిహితులైన కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు తనయుడు వొడితల సతీష్ కుమార్ మూడోసారి హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల బరిలో నిలిచారు. మొదటిసారి 35వేల మెజారిటీతో, రెండోసారి 70వేల మెజారిటీతో గెలిచి మూడోసారి విజయపథంలో దూసుకుపోతున్నారు. ఇంకా బీజేపీ అభ్యర్థి ఖరారు కాలేదు. కాగా కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి టికెట్ దక్కకపోగా, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కు టికెట్ దక్కింది. ప్రవీణ్ రెడ్డి వర్గం ప్రచారానికి దూరంగా ఉంటోంది. అయితే సతీష్ కుమార్ కుమారుడు ఇంద్రనీల్ ఎన్నికల్లో తన తండ్రి విజయం కోసం శ్రమిస్తూ అందరిని ఆకర్షిస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లోనూ ఇంద్రనీల్ తన తండ్రి విజయం కోసం శ్రమించారు. ఇంద్రనీల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేశారు. ప్రస్తుతం తమ విద్యాసంస్థల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రచార వ్యూహం.. ఎత్తులు పైఎత్తులతో. ఇంద్రనీల్ తాత కెప్టెన్ కు తగ్గ మనుమడిగా. తండ్రికి తగ్గ తనయుడిగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే అందరి నోళ్లలో ఇంద్రనీల్ పేరు వినిపిస్తోంది. ప్రచారంలో తెర వెనుక ఇంద్రనీల్ కీలకంగా పనిచేస్తున్నారు. సీఎం కేసీఆర్ హుస్నాబాద్ లో తొలి ఆశీర్వాద సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సభ కోసం భారీ ఏర్పాట్లు, జనసమీకరణ చేసి విజయవంతం చేయడంలో కీలకంగా పనిచేశారు. అంతకు ముందు మంత్రులు కేటీఆర్, హరీష్ రావు సభలు కూడా హుస్నాబాద్ లో జరగ్గా ఇంద్రనీల్ వాటి విజయవంతం కోసం పని చేశారు. తన తండ్రి సతీష్ కుమార్ నెల రోజుల క్రితమే ప్రచారం ప్రారంభించి గ్రామగ్రామాన ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే అక్కన్నపేట మండలంలో ప్రచారం పూర్తి చేశారు. మిగతా అన్ని మండలాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, యూత్, సోషల్ మీడియా విభాగాలను ఇంద్రనీల్ సమన్వయం చేస్తున్నారు. మరోవైపు బూత్ కమిటీల సమావేశాలు ప్రతి గ్రామంలో నిర్వహిస్తూ.. వారిని ఉత్తేజ పరుస్తూ.. తన తండ్రి సతీష్ బాబు విజయం కోసం పనిచేయాలని కోరుతున్నారు.

# పొత్తులపై సీపీఐ కార్యకర్తలు సంయమనం పాటించాలి

## సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ప్రజాస్వామ్య పరిరక్షణ రాజ్యాంగాన్ని కాపాడుట కోసం దేశ వ్యాప్తంగా వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఏకీకరణతో సీపీఐ ఇండియా కూటమిలో భాగస్వామ్యం కలిగి ఉన్నదని సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎన్నికలు ఉన్నందున దేశంలో బీజేపీని,రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సీపీఐతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకొనేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ జాతీయ,రాష్ట్ర నాయకత్వంతో సంప్రదింపులు జరిపారని, సీపీఐ నాయకత్వం రాష్ట్రంలో సీపీఐకి 4 స్థానాలు కావాలని కాంగ్రెస్ ముందు ప్రతిపాదనలు పెట్టినందున సీట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ కాలయాపన చేస్తుందని అన్నారు. సీపీఐ కోరిన స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిందని, పొత్తు ధర్మాన్ని విస్మరిస్తే లక్ష్యం దెబ్బతింటుందని ఆ దిశగా కాంగ్రెస్ ఆలోచించాలని కోరారు. పొత్తుల విషయం ఇంకా పూర్తి స్థాయిలో ఓ కొలిక్కి రానందున సీపీఐ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, రాష్ట్ర పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండి సీపీఐ శ్రేణులు పనిచేయాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 4న హుస్నాబాద్ లోని సీపీఐ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశం జరుగుతుందని, ఆ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరవుచున్నారని ఆ సమావేశంలో చాడ వెంకటరెడ్డి నియోజకవర్గ సీపీఐ శ్రేణులకు నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు.

# శబరిమలకు అద్దె ప్రాతిపదిక ప్రత్యేక బస్సులు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వరంగల్ రీజన్ పరిధిలోని మహబూబాబాద్ డిపో నుంచి శబరిమలకు అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరీ, ఎక్స్ ప్రెస్ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. శబరిమల యాత్రకు వెళ్లు భక్తులకు టీఎస్ఆర్టీసీ మహబూబాబాద్ నుంచి సూపర్ లగ్జరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో డిపాజిట్ లేకుండా అద్దెకు ఇవ్వబడును. శబరిమల బస్సులు మీరు కోరుకున్న ప్రదేశం నుంచి మీరు దర్శించుకోవలసిన పుణ్యక్షేత్రాల మీదుగా నడబడును. ఈ శబరిమలై బస్సులు బుక్ చేసిన ఔత్సాహిక గురుస్వాములకు రోజుకు 300రూపాయలు చొప్పున కమిషన్ ఇవ్వబడును. బస్సుల్లో ఆడియో, వీడియో సౌకర్యం, సెల్ ఫోన్ చార్జర్లు ఏర్పాటు చేయబడును. 30 మంది ఆపై భక్త బృందం ఉన్నచో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయబడునన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959226054, 7382857938, 9948214022 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని మహబూబాబాద్ డిపో మేనేజర్ పేర్కొన్నారు.

# ఘనంగా సమాధుల పండుగ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఖాదర్ పేట సూర్యపేట తండా, క్రీస్తునగర్, నెంబర్ వన్ కాలనీ, లింగగిరి గ్రామాలలో గురువారం సమస్త ఆత్మల పండుగ (సమాధుల పండుగ) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అలంకరించబడిన సమాధులపై పూలమాలలు, పువ్వులతో అలంకరించి క్యాండిల్స్ వెలిగించారు. అనంతరం పాస్టేట్ చైర్మన్ రెవ ఇ సహోదర్ మాట్లాడుతూ ఆత్మల శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 2న మృతి చెందిన పెద్దలను జ్ఞాపకం చేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్ , పాస్టేట్ సెక్రెటరీ గోపు శ్రీనివాస్ రెడ్డి, మిషన్ అండ్ ఇవాంజలిజం సెక్రటరీ గట్ల రవీందర్, యూత్ సెక్రెటరీ గట్ల హనోక్, ట్రెజరర్ శంకేశి రంజిత్ , సూర కార్తీక్, చీర రవి, జన్ను రవి, మహిళలు పాల్గొన్నారు

# ఘనంగా హరిహర క్షేత్రం ఆలయ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూర్ డివిజన్ కేంద్రం నుంచి మానుకోట జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలోని కేవీబీ నగర్ లో గల స్థానిక హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ అర్చకులు రాజేష్ నంబూద్రి, ఆలయ అర్చకులు మధు శర్మలు గణపతి హెూమం, స్వామి వారికి అభిషేకాలు, కలశ పూజ, ఆలయ శుద్ధి చేశారు. అనంతరం పులిహోర ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దారం ప్రసాద్ దంపతులు, చిత్తలూరి సతీష్, బిజ్జాల వెంకట రమణ, వల్లపు మధు, కాంతాల సోమిరెడ్డి, ఇమ్మడి రాంబాబు, రేగూరు శ్రీనివాస్, బిజ్జాల శ్రీనివాస్, చీదర వీరన్న, వనమాల సురేష్, కృపాకర్ రాజు, దొడ్డ రఘు, చిదురాల చంద్రయ్య, ముత్తోజు సత్యనారాయణ, ట్రస్టు సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ పల్లెపాటి రతన్ రావ్ కాంగ్రెస్ లో చేరారు. చింత నెక్కొండ గ్రామం నుంచి వర్ధన్నపేట నియోజకవర్గం ఎల్డీఎం ఇంఛార్జి కుందూరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మేమందరం అహర్నిశలు పనిచేస్తామని వారు అన్నారు. అనంతరం కేఆర్ నాగరాజు మాజీ ఏఎంసీ డైరెక్టర్ ను శాలువాతో సత్కరించారు.

# మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి

## బీజేపీ అభ్యర్థి గుండె విజయరామరావు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** నియోజకవర్గం ప్రజలు నన్ను ఆశీర్వదించి గెలిపించండని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి గుండె విజయరామరావు కోరుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనను, అసెంబ్లీకి శాసనసభ్యుడి పనిచేసిన అనుభవం ఉన్న ఆయన్ని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో అనేక సమస్యలను పరిష్కరించి అందుబాటులో ఉంటానన్నారు. ప్రధాని మోడీ పంపిన అభ్యర్థిని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి ముందు వరుసలో ఉండేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను మరిచారని, దళిత ముఖ్యమంత్రి చేస్తానని, మూడెకరాల భూమి ఇస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని, నిరుద్యోగులకు భృతి ఇస్తానని అధికారంలోకి వచ్చి ఈ హామీలను ఏదీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, ఈ ప్రాంత వాసిగా ఓట్లు అడిగే హక్కు తనకు ఉందన్నారు. అందుబాటులో ఉండి కష్టసుఖాల్లో ముందుండి ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్ కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వడ్డేపల్లికి చెందిన చొల్లేటి రవికాంత్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా అతని స్నేహితులు హనుమకొండలోని ఓ ప్రవేటు ఫంక్షన్ హాల్ లో జరిగిన దశా దినకర్మ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచి రూ.12,00,000 చెక్కును అందజేశారు. అతని కూతురుకి చదువుకు కూడా ఆర్థిక సహాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రవికాంత్ రెడ్డి స్నేహితులు బషీర్, విజయ్ రావు, రామారావు, వినోద్ రెడ్డి, నాగరాజు, సాయి గ్రూప్స్, సురేష్, పరమేష్, అరుణ్ రెడ్డి, శ్రీహరి, గోపి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యతోనే సమాజంలో సమూల మార్పు సాధ్యం.. దీని కోసం అంకురిత దీక్ష, పట్టుదలతో ఒక ఐఏఎస్ ఉన్నతాధికారి తన తల్లిదండ్రుల పేరిట ఒక ట్రస్ట్ పెట్టి ముందుకు కదులుతున్నారు. పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యార్థి లోకాన్ని సమాయత్తం చేసేందుకు నడుం బిగించారు. ఇందులో భాగంగా విద్యా స్ఫూర్తి కార్యక్రమంతో ఉపాధ్యాయుల్లో గుణాత్మక విద్యా బోధనలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు స్వీయ పర్యవేక్షణలో శిక్షణా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల్లో ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా ఆత్మవిశ్వాసం నింపుతున్నారు.



# గుణాత్మక విద్యతోనే సమూల మార్పు

## అభ్యాసన సామర్థ్యాల పెంపే లక్ష్యం

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

### పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమం

### చిట్ల ప్రమీల-జీవన్ రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

**ప్రత్యేక ప్రతినిధి, నిజామాబాద్ :** విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు వారిలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందిస్తూ గుణాత్మక విద్యను బోధించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. తన తల్లిదండ్రులు చిట్ల ప్రమీల –జీవన్ రాజ్ పేరిట నెలకొల్పిన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో బుధవారం పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మండలం పరిధిలోని 19 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఆంగ్ల మాధ్యమంలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు బోధించే 125మంది ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాల పెంపుపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్.సీ.ఈ.ఆర్.టీ) నిపుణులచే ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్మూర్ ఆర్డీఓ వినోద్ కుమార్, డీఈఓ దుర్గాప్రసాద్, డీఐఈఓ రఘురాజ్, డీపీఓ జయసుధ తదితరులు హాజరయ్యారు. తాము బోధించే సబ్జెక్టులను ఇంగ్లీషు భాషలో విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో, వారి సామర్థ్యాలను పెముపొందించేలా ఎలా బోధించాలి అనే అంశాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన రిసోర్సుపర్సన్లు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సెషన్ల వారీగా శిక్షణ తరగతులు కొనసాగాయి.

## పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా తర్ఫీదు..

విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నప్పటికీ విద్యార్థుల్లో ప్రస్తుత పోటీ ప్రపంచ స్థాయికి తగినట్టుగా ప్రతిభ కనిపించడం లేదని ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఒకింత ఆవేదన వెలిబుచ్చారు. గుణాత్మక విద్యా బోధనా, అభ్యాసన సామర్థ్యాల పెంపుతో పరిస్థితిలో మార్పు వస్తుందని కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన అనేక సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుణాత్మక విద్య పాఠశాల స్థాయిలో సాధించాలంటే ఆయా విషయాలలో నిర్దేశించిన సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలు ఖచ్చితంగా తరగతి గది ద్వారా మాత్రమే సాధించవలసి ఉంటుందని, అప్పుడే లక్ష్య సాధన సిద్ధిస్తుందని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు, రోజువారీ పీరియడ్ ప్రణాళికలతో భోదనాభ్యాసన ప్రక్రియలను మదింపు చేసుకొని పిల్లలకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు.

## అభ్యాసన ఫలితాల మెరుగుదలకు వేదిక..

విద్యార్థుల ప్రస్తుత సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2023–24 విద్యా సంవత్సరం నుండి ఆయా తరగతులకు చెందిన వారు అభ్యాసన ఫలితాల మెరుగుదల కోసం చక్కటి కార్యాచరణ ప్రణాళికలు రూపొందిచుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనాంశాల గురించి ప్రతి రోజు పరిశీలించుకుంటూ, బోధనా సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని, పాఠశాల విద్య పూర్తయ్యేసరికి విద్యార్థులందరు ఆయా సబ్జెక్టుల్లో నిర్దేశించిన సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలు సాధించాలని, అప్పుడే గుణాత్మక విద్యను సాధించినట్లు అవుతుందని సూచించారు. భోధనభ్యాసన ప్రక్రియలలో భాగంగా పిల్లల్ని చదివించడం, రాయించడం, చదివింది అర్థం చేసుకోవడం కోసం కృతులు నిర్వహించడం లాంటి విషయాలపై శిక్షణ తరగతుల్లో దృష్టిసారించి ఆయా అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని హితవు పలికారు.

## గుణాత్మక విద్యతో అద్భుత ఫలితాలు..

పిల్లలలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే ముఖ్య కర్తవ్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని అన్నారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలలో 90శాతానికి పైగా మార్కులు సాధిస్తున్న అనేక మంది విద్యార్థులు పై చదువులకు సంబంధించిన ఎంట్రన్స్ ఎగ్జామ్స్ లో మాత్రం ప్రవేశ అర్హత పొందలేకపోతున్నారని, విద్యార్థుల్లో ఆశించిన సామర్థ్యాలు పెంపొందించబడకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ప్రతి ఏటా సుమారు 15 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తుండగా, వారిలో అతికష్టంగా లక్ష మందికి మాత్రమే కొలువులు లభిస్తున్నాయని తెలిపారు. పాఠశాల విద్యా స్థాయి నుంచే విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తే, అద్భుత ఫలితాలు వస్తాయని, సాధారణ విద్యార్థులు కూడా తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరేందుకు దోహదపడుతుందని ఆకాంక్షించారు. తమ పిల్లలు బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. ముఖ్యంగా పేద, దిగువ మధ్య తరగతికి చెందిన పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యా బోధన జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కమిషనర్ పార్థసారథి నొక్కి చెప్పారు. బట్టీ పట్టే విధానం దూరమై, ప్రాథమిక స్థాయి నుండే అభ్యాసన ఫలితాలు, సామర్థ్యాల పెంపు దిశగా కృషి జరగాలన్నారు. వైద్యరంగం పరంగా మాతాశిశు మరణాల రేటును తగ్గించడం, భ్రూణ హత్యలను అరికట్టడంలో చాలావరకు సఫలీకృతులు కాగలిగామని, కోవిడ్ సంక్షోభాన్ని సైతం సమర్థవంతంగా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో బోధించాలని, అప్పుడే సామర్థ్యాలు మెరుగుపడతాయని హితవు పలికారు.

## ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు..

విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసే ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని అభివర్ణించారు. అందుకే యావత్ సమాజం ఉపాధ్యాయులను ఎంతో గౌరవభావంతో చూస్తుందని, ఆ గౌరవాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతాయుతంగా, అంకితభావం, నిబద్ధతతో విధులకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గుకు వచ్చేలా విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు దీటుగా బోధన చేయాలని, ఎంతో నిష్ణాతులైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇది కష్టమైన పని ఏమీ కాదని అన్నారు. అందరు విద్యార్థులను సమ దృష్టితో చూడాలని, అందరి ముందు చులకన చేయడం వల్ల విద్యార్థుల్లో మానసిక కుంగుబాటుకు దారితీస్తుందని, ఈ పరిణామం పలు సందర్భాల్లో పిల్లలను విద్యకు దూరం చేసే ప్రమాదం ఉందన్నారు. బాధించే గురువులుగా కాకుండా, బోధించే గురువులుగా విద్యార్థుల జీవితాలను చక్కదిద్దాలని, పాఠ్యాంశాలతో పాటు వారిలో నైతిక విలువలను పెంపొందిస్తూ ఆదర్శవంతులుగా నిలువాలని హితవు పలికారు. ప్రతిభ, సామర్థ్యాలను పిల్లలలో పెంపొందిస్తే, వాటి ఆధారంగా వారు కోరుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యపడదని, ప్రతిభే కొలమానంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ కంపెనీలు ఆకర్షణీయ వేతనాలతో కొలువులకు ఆహ్వానిస్తున్నాయని, డిగ్రీలు, పట్టాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులు కంకణబద్ధులై కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి పిలుపునిచ్చారు.









## పార్థసారథి తపన అనన్య సామాన్యం..

**– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

తాను చదువుకున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల గురించి, ఇక్కడి విద్యార్థుల బాగోగుల కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పడే తపన అనన్య సామాన్యమైనది అని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనియాడారు. తీరిక లేని కీలకమైన విధుల్లో కొనసాగుతున్నప్పటికీ విద్యా స్ఫూర్తి కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కోవిడ్ సంక్షోభం తరువాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, ముఖ్యంగా ఆన్ లైన్ బోధన విస్తరించిందని అన్నారు. సామాన్య, పేద కుటుంబాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ బడులలో వారికి నాణ్యమైన విద్యను అందించి చక్కటి భవిష్యత్తుకు దోహదపడాలని, దీనిని ప్రతి ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి.ఈ.ఆర్.టీ రిసోర్స్ పర్సన్లు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ చారి, రాజేందర్ కుమార్, ట్రస్ట్ కార్యదర్శి ఎన్.నర్సింలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.







– గడ్డం కేశవమూర్తి


## నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చింతగట్టు ఓఆర్ఆర్ వద్ద గురువారం కేయూసీ పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టైంది. మహారాష్ట్రకు చెందిన రెండు కార్లను ఆపమనగా ఆ కార్లను నడుపుతున్న వ్యక్తులు ఆపకుండా వెళ్లడంతో అనుమానం వచ్చి వెంబడించగా అందులో నుంచి కొందరు వ్యక్తులు పారిపోగా మిగిలిన వ్యక్తులను పట్టుకొన్నారు. అనంతరం పోలీసలు వాహనాలను తనిఖీ చేయడంతో అందులో కొన్ని నోట్ల కట్టలు లభించాయి. వాటిని పరిశీలించగా అవి కొన్ని నకిలీ నోట్ల కట్టలని, కొన్ని అసలైనవని తేలింది. వెంటనే వారిని పట్టుకుని పంచుల సమక్షంలో విచారించగా వారు పోరిక రాజ్ కుమార్ ములుగు ఘనపూర్ అతనికి తెలిసిన బూర శ్రీకాంత్, రాజేష్, మంతెన కావ్య నలుగురు ముఠాగా ఏర్పడి నకిలీ నోట్ల వ్యాపారం చేస్తున్నారని తెలిసింది. గతంలో పోరిక రాజ్ కుమార్ చాలాసార్లు జైలుకి వెళ్లి వచ్చినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈక్రమంలో రాజ్ కుమార్‌కు నాందెడ్‌కు చెందిన పఠాన్ హుస్సేన్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని ఎవరికైనా నకిలీ నోట్లు కావాలంటే ఇస్తానని అలాంటి వాళ్లను తన వద్దకు పంపితే వచ్చిన లాభం నుంచి సగం ఇస్తానని చెప్పాడు. దీంతో పఠాన్ తనకి తెలిసిన వాళ్లకు నకిలీ నోట్లు కావాలని, వారికి ఇవ్వమని చెప్పడంతో వారిని హనుమకొండ రమ్మన్నాడు. పఠాన్‌కు తెలిసిన ఓంకార్ విశ్వనాథరావు బూరే, విష్ణు కవాల్ అడగడంతో వారిని హనుమకొండ వెళ్లి నకిలీ నోట్లు తీసుకోమని చెప్పగా వారు నాందేడ్ నుంచి ఇక్కడకి డ్రైవర్ దొండ్జి సంబాజీతో కలిసి స్థానిక మయూరి లాడ్జి పక్కనే ఉన్న సతీష్ లాడ్జిలోకి రాగా పోరిక రాజకుమార్ వెళ్లి వారిని కలవగా హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్స్ వద్దకు వస్తే రెండు లక్షలు అసలు నగదు తీసుకొని, 4లక్షల నకిలీ నోట్లు ఇస్తానని చెప్పడంతో వారు రెండు లక్షలు ఇచ్చారు. అందులో నుంచి లక్ష రూపాయలు పఠాన్‌కు ఆన్ లైన్‌లో ట్రాన్స్ ఫర్ చేశారు. వారు ఆ నాలుగు లక్షలు నకిలీ నోట్లు తీసుకొని పోరిక రాజ్ కుమార్ ను అతడితో పాటు ఉన్న వ్యక్తులను హనుమకొండ దాటించే వరకు వారికి తోడు రమ్మనగా వాటిని తీసుకొని వెళ్తుండగా చింతగట్టు బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఇందులో పోరిక రాజ్ కుమార్, ఓంకార్ విశ్వనాథరావు బూరే, విష్ణు కవాల్, దొండ్జి సంబాజీ దొరకగా వారిని అరెస్ట్ చేయడం జరిగింది. రాజేష్, బూర శ్రీకాంత్, మంతే కావ్య అక్కడ నుంచి పారిపోయారు. దొరికిన వ్యక్తుల వద్ద నుంచి రూ.85,000 విలువ చేసే ఒరిజనల్ 500రూపాయలు నోట్లు, 4 లక్షలు నకిలీ 500 కరెన్సీ, రెండు కార్లు, 5 సెల్ ఫోన్లు, నకిలీ కరెన్సీ తయారు చేయుటకు కావాల్సిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కేయూసీ పోలీసులను, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాఅభినందించారు. కేయూసీ ఇన్ స్పెక్టర్ అబ్బయ్య, ఎస్సై సురేష్, అనిల్, రాజ్ కుమార్, సిబ్బంది, టాస్క్ ఫోర్స్ సీఐ రాంబాబు, ఎస్ఐ శరత్, సిబ్బంది అశోక్, సాంబరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## అక్రమాలపై ఉక్కు పాదం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సి-విజిల్ యాప్ ద్వారా పౌరుడు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. గురువారం కలెక్టర్ కంట్రోల్ రూమ్ ను ఆమె సందర్శించారు. టోల్ ఫ్రీ నంబర్ 1950, సి-విజిల్ యాప్ పని తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫోటోలు, లైవ్ వీడియోలను సి - విజిల్ యాప్ ద్వారా తీసి పంపాలన్నారు. సి-విజిల్ యాప్ ను తమ ఫోన్లలలో ప్లే-స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని తమ చుట్టుపక్కల జరుగుతున్న ఎన్నికల అక్రమాలను యువత అడ్డుకోవాలన్నారు. ఇప్పటి వరకు సి-విజిల్ యాప్ ద్వారా 49 కేసులు నమోదు కాగా అందులో ఏడు సమస్యలు పరిష్కారం అయ్యాయని, అందులో 42 డ్రాప్ కేసులు ఉన్నాయన్నారు. ఇది ఇలా ఉండగా ఓటర్ వివరాల కోసం 1950 టోల్ ఫ్రీ నంబర్ కాల్ చేసి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# రేపటినుంచి నామినేషన్ల స్వీకరణ

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. గురువారం వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని వర్ధన్నపేట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి అశ్విని తానాజీ వాకాడే, ఏఆర్ఓ విద్యాసాగర్ సంబంధిత ఎన్నికల సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదిన నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నవంబర్ 10వ తేదీన నామినేషన్ల స్వీకరణ ముగుస్తుందని తెలిపారు. అన్ని పనిదానాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. 13 వ తేదీన నామినేషన్ ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 15 వ తేదీన నామినేషన్ ల ఉపసంహరణ కు తుది గడువని చెప్పారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ దాఖలుకు ముందు అభ్యర్థులు తమ నామినేషన్లను హెల్ప్ డెస్క్ లో చెక్ చేయించుకోవాలన్నారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు నామినేషన్ సెట్లను దాఖలు చేయవచ్చని తెలిపారు. నామినేషన్ ల దాఖలుకు అభ్యర్థితో పాటు ఐదుగురికి (1 o4) మాత్రమే అనుమతి ఉందన్నారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు బారికేడ్లు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, పటిష్ట బందోబస్తు నడుమ ఈ ప్రక్రియ నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నామినేషన్ కేంద్రానికి కేవలం మూడు వాహనాలనే అనుమతిస్తామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. అనంతరం వర్ధన్నపేట నియోజకవర్గంలో ఖర్చుల మోనిటరింగ్ టీం, స్టాటిక్ సర్విలెన్సు టీం, వీడియో సర్వ్ లెన్స్ టీం, వీడియో వివింగ్ టీంలతో సమావేశమై ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ అభ్యర్థుల ఖర్చులు నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సంజీవ్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం..

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ (తూర్పు)106-నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియకు సర్వం సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా తెలిపారు. ఈ మేరకు గురువారం సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీతో కలిసి బారికేడ్ల ఏర్పాటు, పోలీసు బందోబస్తు, మీడియా పాయింట్ ఏర్పాటు తదితర అంశాలపై బల్దియా ఆవరణలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ అనిసుర్ రషీద్, డీపీఆర్ఓ ఆయూబ్ అలీ, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ బోనాల కిషన్, తహశీల్దార్ ఇక్బాల్, సీఐ వెంకటేశ్వర్లు, ఎన్నికల డీటీ మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట్ :** యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలం ఇల్లంద కస్తూర్బా బాలిక విద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖెడే, జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతిలతో కలసి ప్రారంభించారు. 360మంది విద్యార్థులు కలిగిన ఈ విద్యాలయానికి రూ.2లక్షలతో బాలికల మూత్రశాలలు, టాయిలెట్స్ ను ఆధునికరించడం జరిగింది. బాలికల నెలసరికి అవసరమగు సిఫ్టీ నాప్కిన్స్ తయారీ కోసం రూ.20వేల విలువ కలిగిన వెండింగ్ మిషన్స్ ను అందించిన యూనియన్ బ్యాంక్ అధికారులను కలెక్టర్ అభినందిస్తూ, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలను ఇతర పాఠశాలలకు విస్తరింపచేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి మాట్లాడుతూ 10వ, ఇంటర్మీడియట్ తరగతుల విద్యార్థులకు విద్యాపరమైన సూచనలు తెలియజేస్తూ మార్చిలో జరుగబోయే వార్షిక పరీక్షలకు మానసికంగా సిద్ధం కావాలన్నారు. మెరుగైన ఫలితాలతో జిల్లాని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఈ నెల 3న జరుగబోయే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్ మెంట్ సర్వేకు సంబందించి ఏర్పాట్లను పర్యవేక్షించి, తగు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, కస్తూర్బా విద్యాలయ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శంకర్ నాయక్ భూకబ్జాకోరు

### సీపీఎం నేతలు సుంకరి వీరయ్య, నాగయ్య



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రాజ్యాంగబద్ధంగా పేదలు తమ హక్కుల సాధనలో భాగంగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తుండగా ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ దళిత, గిరిజన, పేద గుడిశవాసులపై అధికార యంత్రాంగంతో దాడులు దౌర్జన్యం చేయిస్తూ ఖాళీ చేయిస్తు ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తున్నాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే గుడిసె వాసులు నాన్ లోకల్ వారని అంటున్నారని, శంకర్ నాయక్ నాన్ లోకల్ కాదా అని ఆయనకిక్కడ నామినేషన్ వేసే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సుంకర వీరయ్య, జీ నాగయ్య విమర్శించారు. మహబూబాబాద్ పట్టణంలో గుడిసెలు వేసిన పేదల కోసం సీపీఎం పోరాటం ఆగదని కేసులకు దాడులకు భయపడేది లేదని అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో కురవి రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు వేసినా గుడిసెలను గురువారం తెల్లవారుజామున పోలీసు యంత్రాంగం 17వ సారి మళ్లీ నేలమట్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర సీపీఎం నాయకులు సుంకర వీరయ్య, జీ నాగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ బృందం నేలమట్టమైన గుడిసెలను సందర్శించి గుడిసె వాసులను పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మానుకోట పట్టణంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుంకరి వీరయ్య మాట్లాడారు. మహబూబాబాద్ పట్టణంలో కురవి రహదారిలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు సుమారు రెండువేల మంది గుడిసెలు వేసుకుని ఏడాది కాలంగా నివసిస్తున్నారని, వారిని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ప్రభుత్వ యంత్రాంగంతో ఆ గుడిసె వాసులపై 17సార్లు దాడులు, దౌర్జన్యాలు చేయించి గుడిసెలు దగ్ధం చేయించి దుర్మార్గంగా వ్యవహరించార మండిపడ్డారు. విద్యావంతుడు, ఇంజినీరింగ్ గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ గిరిజన దళిత పేదలు గుడిసెలు వాసులపై ఇంత కక్షపూరిత ధోరణి ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే శంకర్ నాయక్ తన వైఖరి మార్చుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేదంటే ప్రజా ద్రోహులుగా, వ్యతిరేకులుగా మిగిలిపోతారని హెచ్చరించారు ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్ణపు సోమయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, అల్వాల వీరన్న, ఆంగోతి వెంకన్న, బానోతు సీతారాం నాయక్, సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com